జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శనివారం
17 01 2026
సంపుటి 1 సంచిక 56
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195

రిపోర్టర్లకు ఆహ్వానం..
జర్నలిజంలో సత్తా చాటేందుకు
సరైన వేదిక కోసం ఎదురుచూస్తున్నారా? అయితే..
ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పాటు
GHMC పరిధిలో డివిజన్ల వారీగా విలేకరులకు ఇదే
జ్వాల దశ దినపత్రిక ఆహ్వానం.

అర్హతలు:
- ఫీల్డ్లో తిరిగి వార్తలు సేకరించే సామర్థ్యం
- సమాజ సమస్యలను నేరుగా వెలికి తీసే ధైర్యం
- నిజాన్ని నిర్భయంగా రాయగల నిబద్ధత

అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా
జర్నలిజం రంగంలోకి రావాలనుకునే ఔత్సాహికులకు
అవకాశం ఇవ్వడానికి జ్వాల దశ సిద్ధంగా ఉంది.

రిపోర్టర్గా పనిచేయాలనుకునే అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం బ్యూరో ఇంచార్జ్ను సంప్రదించవచ్చు. . (వాట్సాప్లో సంప్రదించండి)
7337 54 6647
9848 28 8850
జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..

## పట్నం బాట పట్టిన ప్రజలు



**దశ, హైదరాబాద్:** సంక్రాంతి సంబురం ఇవాల్టితో ముగుస్తుంది. ఇక ఏపీలోని సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - విజయవాడ హైవేపై రద్దీని తగ్గించేందుకు నల్గొండ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల, పెద్ద కాపర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండటతంతో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉన్నందున దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.



## ఏడుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్...

### కేటీఆర్ మండిపాటు

వివరాలు 4లో

## పురపోరు.. రిజర్వేషన్లు ఖరారు



### మునిసిపాలిటీలలో2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు

### బిసిలకు బిసి డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు మేరకు ఖరారు

వివరాలు 4లో

# బాసర ఐఐటిలో యూనివర్సిటీ..



### తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం

### అదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు, పారిశ్రామికవాడ

### ఏర్పాటు: సీఎం రేవంత్

**దశ, నిర్మల్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే నాకు ప్రత్యేక అభిమానం. జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాటాల గడ్డ ఇది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు . అందుకే పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇస్తానని చెప్పానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ లో జరిగిన "ప్రజా పాలన ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా అభివృద్ధి పథంలో సాగేది. కానీ కారణాలు ఏవైనా ప్రాజెక్టులు పూర్తి కాలేదు. అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేస్తున్నాం. ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ మంజూరు అయినా ఎవరికి వారు తమ ప్రాంతానికే రావాలనుకోవడంతో యూనివర్సిటీ

..మిగతా 4వ పేజీలో →

## సదరన్ కమాండ్ సెంటర్ ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌కు మార్చండి: సీఎం రేవంత్

**దశ, హైదరాబాద్:** ఆర్మీ, తెలంగాణ ప్రభుత్వం మధ్య సమస్యలు నిరంతర చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమస్యలు పరిష్కరించుకునేందుకు మీ వైపు నుంచి కూడా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఆర్మీ ఉన్నతాధికారులను ఆయన కోరారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సివిల్ మిలిటరీ లైజన్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ. దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో సహకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందు ఉంటుందని వారికి సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగానే వికారాబాద్‌లో,లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడార్ స్టేషన్‌కు తమ ప్రభుత్వం 3 వేల ఎకరాలు కేటాయించిందని ఈ సందర్భంగా ఆర్మీ ఉన్నతాధికారులకు ఆయన గుర్తు చేశారు. ఈ కాన్ఫరెన్స్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మేజర్ జనరల్ అజయ్ మిశ్రా తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్, డీజీపీ శివధర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు ఆర్మీ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం తరపున పలు విజ్ఞప్తులను ఆర్మీ ఉన్నతాధికారుల దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్ళారు.



## మేడారానికి పోటెత్తిన భక్తులు

**దశ, ములుగు**



మేడారం మహా జాతరకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ములుగు గట్టమ్మ తల్లి ఆలయం వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జాగారం నుంచి మేడారం వరకు వాహనాల రద్దీ కొనసాగుతుండగా, కన్నెపల్లి, జంపన్నవాగు, హరిత హోటల్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పోలీసులు ట్రాఫిక్ను మళ్లిస్తున్నారు. పొలాల్లో తాత్కాలిక పార్కింగ్ ఏర్పాట్లు చేసి వాహనాలను అక్కడికి మళ్లిస్తున్నారు. ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారం మహా జాతర జరగనుండటంతో రాబోయే రోజుల్లో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## హాట్ బెలూన్ ఫెస్ట్ రెడీ

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో రంగురంగుల 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివెల్' ప్రారంభమైంది. శుక్రవారం మొదలైన ఈ వేడుక ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరగనుంది. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఉత్సవాలను ప్రారంభించారుమంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆకాశంలో గంటన్నర పాటు సుమారు 13 కిలోమీటర్లు ప్రయాణించారు. మంత్రి ప్రయాణించిన హాట్ ఎయిర్ బెలూన్ గోల్ఫ్ క్లబ్w నుంచి ప్రారంభమై అప్పాజీగూడ శివారులో దిగింది. హాట్ ఎయిర్ బెలూన్‌లో ప్రయాణించడం ఒక చిరస్మరణీయ అనుభవమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్ట్ ద్వారా రాష్ట్ర పర్యాటక శాఖ ఒక సరికొత్త అధ్యయనానికి నాంది పలికిందని ఆయన అన్నారు. ఉదయం 18 హాట్ ఎయిర్ బెలూన్లలో దాదాపు 40 మంది ప్రయాణించారు.హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్ట్, డ్రోన్ ఫెస్ట్, కైట్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలతో పర్యాటక శాఖ ప్రజలను ఆకట్టుకుంటోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సంస్కృతి, సాంకేతికతల కలయికతో పర్యాటక శాఖ ముందుకు వెళ్తోందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని



అన్నారు. ఇలాంటి ఉత్సవాలు అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ హాట్ బెలూన్‌లో 45 నిమిషాల నుంచి ఒక గంట వరకు ప్రయాణం ఉంటుందని, వాతావరణ పరిస్థితులను బట్టి 8 నుంచి 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. హాట్ ఎయిర్ బెలూన్‌లో ఒక్కో రైడ్‌కు రూ.2,000 ఉంటుందని వారు వెల్లడించారు. వాతావరణ పరిస్థితులను బట్టి జనవరి 17, 18 తేదీలలో వేదికలను ఖరారు చేస్తామని అన్నారు. ఈ రోజు సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో రైడ్ ఉంటుందని అధికారులు తెలిపారు.

# వ్యవసాయ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు

## రెవెన్యూ శాఖలో పెను తుపాను.. రెవెన్యూ సిబ్బందిలో తీవ్ర ఆందోళన

**దశ, మహబూబ్ నగర్:** తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల అక్రమాల విచారణ రెవెన్యూ అధికారులను కలవరపెడుతోంది. 20212025 మధ్య కాలంలో జనగామ, రంగారెడ్డి వంటి కీలక జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు ఇప్పుడు ఏసీబీ విచారణకు భయపడుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన లావాదేవీల్లో చలానాల మాయాజాలం, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ఆడిటింగ్ నిర్వహిస్తోంది. ఇప్పటికే పలువురు రైతులకు నోటీసులు జారీ కాగా.. సంక్రాంతి తర్వాత అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అక్రమాల విచారణ ఇప్పుడు రెవెన్యూ శాఖలో పెను తుపానును సృష్టిస్తోంది. ప్రధానంగా భూముల క్రయవిక్రయాల్లో జరిగిన లావాదేవీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించడంతో.. గతంలో కీలక జిల్లాల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు వణికిపోతున్నారు.ముఖ్యంగా 2021 నుండి 2025 మధ్య కాలంలో జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ విచారణ కమిటీలో అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా సభ్యులుగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో తాము చేసిన భూముల బదిలీలు లేదా రిజిస్ట్రేషన్లలో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా అనే కోణంలో సిబ్బంది ఆరా తీస్తున్నారు.ఈ కేసు ఒక ప్రాంతానికో లేదా ఒక అధికారికి సంబంధించినది మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లలో అనేక లోపాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లు తప్పుడు చలానాలను సృష్టించడం లేదా ఒకే చలానాను ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉపయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతి రిజిస్ట్రేషన్ లావాదేవీని క్షుణ్ణంగా ఆడిటింగ్ చేస్తున్నారు. కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆడిటింగ్‌లో 90 శాతం నివేదికలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. కొన్ని చోట్ల చిన్నపాటి పొరపాట్లు జరిగినట్లు అధికారులు అంగీకరిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టే స్థాయిలో అక్రమాలు జరిగాయా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ కేసు తేలే వరకు తహసీల్దార్ల కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా పోయింది.



# పురపోరు.. రిజర్వేషన్లు ఖరారు

**దశ, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణను ప్రభుత్వం మరింత వే గవంతం చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ టికె శ్రీదేవి రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా 10 కార్పొరేషన్‌లు, 121 మున్సిపాలిటీలు ఉన్నాయి. మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలో ఎస్సీ, ఎస్టిలకు రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన కేటాయించగా, బిసిలకు బిసి డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు మేరకు ఖరారు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లలో గ్రేటర్ హైదరాబాద్‌తో సహా కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, రామగుండం, మంచిర్యా ల, నల్గొండ, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లున్నాయి. వీటికి 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఎస్సి, ఎస్టిలకు రిజర్వేషన్‌లు ఖరారు చేయగా, బిసిలకు మాత్రం బిసి డెడికేటెడ్ కమిషన్ అందజేసిన నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వీటిలో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరే న్‌లో 300 వార్డులుండగా, ఇందులో ఎస్టిలకు 5 రిజర్వు చేయగా, 3 జనరల్, రెండు మహిళలకు కేటాయించారు.ఎస్టిలకు 23 రిజర్వు చేయగా ఇందులో




12 జనరల్, 11 మహిళలకు కేటాయించారు. బిసిలకు 122 రిజర్వు చేయగా, ఇందులో 61 జనరల్, 61 మహిళలకు కేటా ించారు. అలాగే, కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 వార్డులుండగా ఎస్టిలకు 11, ఎస్సిలకు 12, బిసిలకు 7 రిజర్వ్ చేశారు. ఖమ్మం కార్పొరేషన్ 60 వార్డులుండగా ఎస్టిలకు 3, ఎస్సిలకు 7, బిసిలకు 20 స్థానాలు రిజర్వు చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 66 వార్డులుం గా ఎస్టిలకు 2, ఎస్సిలకు 11, బిసిలకు 20 స్థానాలు రిజర్వు చేశారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో 60 వార్డులుండగా, ఎస్టిలకు 1, ఎస్సిల 5, బిసిలకు 24 కేటాయించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 వార్డులుండగా ఎస్టిలకు 1, ఎస్సిలకు 7. బిసిలకు 25 కేటాయించారు. రామ ుండం కార్పొరేషన్‌లో 60 వార్డులుండగా ఒకటి ఎస్టిలకు, 13 ఎస్సిలకు, 16 బిసిలకు కేటాయించారు. మంచిర్యాల కార్పొరేషన్‌లో 60 వార్డు ుండగా, ఎస్టిలకు 1, ఎస్సిలకు 9, బిసిలకు 20 కేటాయించారు. నల్గొండ కార్పొరేషన్‌లో 48 వార్డులుండగా ఎస్టిలకు 1, ఎస్సిలకు 9, 20 బిసిలకు కేటాయించారు. మహబూబ్‌నగర్‌లో 60 వార్డులుండగా ఎస్టిలకు 1, ఎస్సిలకు 3, 26 బిసిలకు కేటాయించారు. సామాజిక వర్గాల వారీగా కేటాయించిన రిజర్వేషన్లను మళ్లీ ప్రత్యేకంగా కొన్నింటిని మహిళలకు రిజర్వు చేశారు. 121 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ల సంఖ్య ఖరారు చేసింది. వీటిలో జనరల్ 3౦, జనరల్ మహిళ 31, ఎస్టి జనరల్ 3, ఎస్టి మహిళ 2, ఎస్సి జనరల్ 9, ఎస్సి మహిళ 8, బిసి జనరల్ 19, బిసి మహిళ 19 స్థానాలను కేటాయించారు. మున్సిపాలిటీల వారీగా ఏ వార్డు ఎవరికి అన్నదానిపై ఈ నెల 17న రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు.

# బాసర ఐఐటిలో యూనివర్సిటీ..



**మొదటి పేజీ తరువాయి**

ఏర్పాటు జాప్యమైంది. బాసర ఐఐటి లో యూనివర్సిటీకి ఏర్పాటు చేసుకుందాం . ఇందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కి సూచన చేస్తున్నా నని అన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షలు నిర్వహించాలని పెద్దలు సుదర్శన్ రెడ్డి కి సూచన చేస్తున్నా. మీరు ఒక నివేదిక తయారు చేసి ఇవ్వండి... ఆదిలాబాద్ కు కావాల్సిన అభివృద్ధి, రావాల్సిన నిధులను మంజూరు చేసుకుందాం . ఆదిలాబాద్ రైతాంగానికి నీళ్లు ఇవ్వాలంటే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాల్సిందే. బడ్జెట్ సమావేశాల లోపు తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై సంపూర్ణ నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచన చేస్తున్నా. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించుకుందాం.. ప్రతీ చుక్కను ఒడిసిపట్టుకుని ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసుకుందాం. ఎర్రబస్సు తిరగని ఆదిలాబాద్ లో ఎయిర్ బస్ తిరిగేలా ఎయిర్ పోర్టును ఏర్పాటు చేసుకుందాం . కేవలం ఎయిర్ పోర్టు ఒక్కటే ఏర్పాటు చేసుకుంటే సరిపోదు .ఆదిలాబాద్ లో అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసుకుందాం . పదివేల ఎకరాలు సేకరించి ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. నాకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు మంచి చేయడానికే కేటాయిస్తా. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు మంచి చేసేవారిని, అభివృద్ధి చేసే వారినే గెలిపించుకోండి గత ఎన్నికల్లో గెలిచాం.. రాబోయే ఎన్నికల్లో గెలుస్తాం. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తాం. చనాక కొరటా కు సీ. రామచంద్రా రెడ్డి పేరు, సదర్మట్ బ్యారేజీకి నర్సారెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించాం . ప్రజలకు సేవలందించిన ఆ ఇద్దరి పేర్లు రెండు ప్రాజెక్టులకు పెట్టాలని అధికారులకు సూచన చేస్తున్నానని అన్నారు.

# ఏడుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్... కేటీఆర్ మండిపాటు

**దశ, హైదరాబాద్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా వేదికగా ఏడుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్చిట్ ఇవ్వడంపై మండిపడ్డారు కేటీఆర్. పార్టీ మారినట్టు కళ్ల ముందు సాక్ష్యాలు కనిపిస్తున్నా, ఆధారాలు లేవనడం శాసన సభను అవమానించడమేన్నారు. స్పీకర్ వ్యవస్థను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ పార్టీ, తన దిగజారుడుతనాన్ని మరోసారి చాటిచెప్పిందన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉపఎన్నికలకు వెళ్లేందుకు.. కాంగ్రెస్ భయపడుతోందనేది స్పీకర్ తీర్పుతో తేలిపోయిందని అన్నారు. ప్రజాతీర్పును అవమానించిన జంప్ జిలానీలకు, వారికి కండువాలు కప్పిన వాళ్లకు బుద్ధి చెప్పేవరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందన్నారు కేటీఆర్.

# వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ

**ఖమ్మం బహిరంగ సభకు భారీగా తరలి రండి: సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ**



**దశ, కారేపల్లి:** సిపిఐ పార్టీకి వందేళ్ళ ఘన చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని ఈనెల జనవరి 18న ఖమ్మంలో జరిగే వంద సంవత్సరాల వేడుకల బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో మండల నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు నివాస గృహంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో శివరాం కృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోనే పలు ప్రాంతాల నుండి అనేక వాహనాల ద్వారా కార్యకర్తలను ఈ భారీ బహిరంగ సభకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతోపాటు కార్యకర్తలను సభకు తరలి రావాలని కోరినట్లు ఆయన తెలిపారు. చిరస్థాయిగా నిలిచే విధంగా ఈ సభ ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ పార్టీ జాతీయ అంతర్జాతీయ నాయకులతో పాటు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ సభలకు వస్తున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు,వద్దే వెంకటయ్య, పుచ్చకాయల వెంకటకృష్ణ, బొమ్మల కృష్ణమూర్తి, మేదరమట్ల ప్రేమ్చంద్, సిపిఎం నాయకులు ఎస్.కె సైదులు, హలవత్ చిన్నా, బొచ్చు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా అఖిల రాజ్ ఫౌండేషన్

**దశ, దౌల్తాబాద్:** ఆపదలో ఉన్న కుటుంబాలకు అఖిల రాజ్ ఫౌండేషన్ ఆపన్నహస్తం అందిస్తుంది. నిరుపేద కుటుంబాలకు నీడై తోడునిలుస్తుంది. దౌల్తాబాద్ మండలం మల్లేశం పల్లి గ్రామానికి చెందిన పుర్ర కనకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తౌడ సత్యనారాయణ గారు వెంటనే తమ దాతృత్వం చాటుకున్నారు. ఫౌండేషన్ మండల అధ్యక్షులు కోరే శేఖర్ ద్వారా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం సమకూర్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మండల అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ బాధితుని పిల్లల చదువుల కోసం ఫౌండేషన్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. చెరుకూరి అనంతయ్య ట్రస్ట్ అధ్వర్యంలో చెరుకూరి వేణు కూడా అర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మల్లేశంపల్లి ఉప సర్పంచ్ గణేష్ వార్డ్ సభ్యులు మిర్గాం రమేష్ కౌడ నరేష్, రామచంద్రం, తిరుపతి, భాషా, హైలేష్, యాదగిరి, రాజు, నవీన్, విజయ్, గ్రామస్తులు అశోక్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాల్లో భారీగా కోడి పందేలు

**దశ, ఖమ్మం:** సంక్రాంతి పండుగ వేళ తెలంగాణఆంధ్ర సరిహద్దుల్లో కోడి పందాల జోరు శిఖర స్థాయికి చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు సమీపంలోని ఏలూరు జిల్లా గ్రామాల్లో పందెం రాయుళ్లు లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో పోలీసుల నిఘా పెరగడంతో, వేలాది మంది జూదరులు కారుల్లో ఆంధ్ర వైపు తరలివెళ్తున్నారు. మామిడి, పామాయిల్ తోటల్లో ఫ్లడ్ లైట్ల మధ్య రాత్రిపూట కూడా పందాలు సాగుతున్నాయి. కోడి కత్తుల పోరుతో పాటు పేకాట, గుండాట వంటి జూదాలు కూడా జోరుగా నడుస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో ఈసారి పందాల వేడి శిఖర స్థాయికి చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలు ఈసారి కోడి పందాలకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, చీరవల్లి, శ్రీధర్ వేలేరు, వేలేరుపాడు మండలం మేడేపల్లి వంటి గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచే పందాలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులే స్వయంగా ఈ పందాలను ప్రారంభించడం గమనార్హం. మామిడి తోటలు, పామాయిల్ తోటలు పందెం వేదికలుగా మారిపోయాయి. రాత్రి వేళల్లో కూడా పందాలు నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లు, జనరేటర్లు సిద్ధం చేశారు. సంక్రాంతి సమయంలో కోడి పందాలు అనేది కేవలం వినోదం మాత్రమే కాదు.. దీని వెనుక ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థ నడుస్తుంది. పందెం కోళ్లను పెంచడం ఒక ప్రత్యేక కళ. వీటికి బాదం, పిస్తా, జీడిపప్పు వంటి బలవర్ధకమైన ఆహారంతో పాటు మాంసాహారాన్ని కూడా ఇస్తుంటారు. ఒక్కో పందెం కోడి ధర వేల నుంచి లక్షల రూపాయల వరకు ఉంటుంది.కోడి కాళ్లకు కట్టే కత్తులను ప్రత్యేకంగా తయారు చేస్తారు. వీటిని 'కోడి కత్తులు' అంటారు. ఈ కత్తులు ఎంత పదునుగా ఉంటాయంటే.. తగిలితే క్షణాల్లో ప్రత్యర్థి కోడి ప్రాణాలు కోల్పోతుంది. పందెం రాయుళ్ల కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా విందులు, విలాసాలు ఏర్పాటు చేస్తారు. తెలంగాణలోని భద్రాద్రి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల నుంచి వందల సంఖ్యలో కార్లలో ధనవంతులు, వ్యాపారులు ఏపీకి తరలివెళ్లారు. కోడి పందాలు జరిగే చోట కేవలం పందాలే కాకుండా పేకాట, గుండాట వంటి ఇతర జూదాలు కూడా జోరుగా సాగుతున్నాయి.



# వైస్ చైర్మన్, సర్పంచ్ లకు సన్మానం

**దశ, దౌల్తాబాద్:** మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన మద్దెల స్వామితో పాటు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన మద్దెల వనజలను మండల మహిళ సమైక్య సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమానికి కృషి చేయాలనే ఆశయంతో నాయకత్వ బాధ్యతలు స్వీకరించినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

# సర్పంచ్ మద్దతుదారులపై దాడులు..?

**దశ, కారేపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసినప్పటికీ కారేపల్లి మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీలో ఎన్నికల ఘర్షణ వాతావరణం ఇంకా కొనసాగుతోంది. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన వారికి మద్దతుగా నిలిచిన వారిని ప్రత్యర్థులు టార్గెట్ చేసి దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓటమిని జీర్ణించుకోలేక పచ్చని పల్లెలో అరాచక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రత్యర్థి అనుచరులు చేసిన దాడుల పై ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా నమోదయ్యాయి. పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయినప్పటికీ ప్రత్యర్థుల ప్రవర్తనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్పంచ్ అభ్యర్థికి ఎవరు మద్దతుగా వ్యవహరించారో వారిని గుర్తించి అక్రమ దాడులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు




ఉన్నాయి. ప్రజల స్వేచ్ఛను కాలరాస్తూ దాడులకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించినప్పటికీ ప్రత్యర్థుల వైఖరిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలంపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు పోటీ చేయగా, అధికార పార్టీ మద్దతు అభ్యర్థి విజయం సాధించారు. అదే రోజు సాయంత్రం శివరామ్ అనుచరులు ఇండిపెండెంట్ అభ్యర్థి భద్రమ్మ ఇంటిపై దాడి చేయడమే కాకుండా, భద్రమ్మ కుటుంబ సభ్యులైన జబ్బ కార్తీక్, తాటి పాపారావు పై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కార్తీక్ కంటిపై తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆసుపత్రికి తరలించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు తక్షణమే కేసు నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన అలేం ప్రభాకర్‌ను కూడా బెదిరింపులకు గురిచేయగా, ఆయన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశారు. అనంతరం కారేపల్లి పోలీసులు ఏసీపీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సీఐ నునావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపితో కలిసి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి చట్టంపై అవగాహన కల్పిస్తూ దాడులకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోలీసుల కౌన్సిలింగ్‌తో గొడవలు సద్దుమణిగాయని భావించిన లోపే ఈ నెల 14వ తేదీ రాత్రి మళ్లీ పోలంపల్లి గ్రామంలోని నాగయ్య గుంపు వద్ద డీజే విందులతో పార్టీలు చేసుకుంటూ కొందరు వ్యక్తులు “శివరామ్‌కు ఎందుకు సపోర్ట్ చేయలేదని ప్రశ్నిస్తూ కురుస సాయి ప్రకాష్ అనే యువకుడి కుటుంబంపై దాడి చేశారని ఆరోపణలు ఉన్నాయి. బాధితులు పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు.

**కారేపల్లి ఎస్ఐ బైరు గోపి వివరణ**

పోలంపల్లి గ్రామంలో ఎన్నికలు ముగిసిన అనంతరం శివరామ్ అనుచరులు కొందరు వ్యక్తుల పై దాడులకు పాల్పడిన ఘటనల్లో చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏసీపీ సూచన మేరకు సీఐ ఆధ్వర్యంలో గ్రామంలో కౌన్సిలింగ్ నిర్వహించామని చెప్పారు. ఇకపై ఎవరైనా దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిన వ్యక్తి మళ్లీ దాడులకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.